క్లుప్తంగా

ఘనంగా భక్త మార్కండేయ జయంతి



మార్కండేయుడి చిత్రపటానికి పూజలు చేస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

సీతంపేట: భక్త మార్కండేయుడి జయంతిని జీవీఎంసీ 25వ వార్డు శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సీతంపేటలో ఘనంగా నిర్వహించారు. మార్కండేయుడి చిత్రపటానికి పూలమాల వేసి, పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరణం వెంకటేశ్వరరావు, తెడ్లాపు వెంకటేశ్వరరావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పద్మశాలి కులస్తులు సమైక్యంగా ఉంటూ, అన్ని రంగాలలో రాణించాలన్నారు. కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్ఏ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఈవో చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ 2023–డైరీని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఏపీపీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు జె.సోమశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రామకృష్ణ, కార్యదర్శి సీహెచ్ రమేష్, కార్యనిర్వాహణ కార్యదర్శి డీవీ శ్రీనివాస్, కోశాధికారి సీహెచ్ శ్రీనివాస్, సలహాదారులు ఎం.శ్రీనివాసరావు, పి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'బుల్లయ్య' విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సీతంపేట: కృత్రిమ మేధస్సు, బిగ్‌డేటా కోడింగ్, ప్రోగ్రామింగ్ వంటి భవిష్యత్ టెక్ డొమైన్స్‌లో యువతకు అదనపు నైపుణ్యాలు, ఉద్యోగ కల్పనకు శామ్‌సంగ్ ఇండియా ఇన్నోవేషన్ క్యాంపస్ సీఎస్ఆర్ ప్రోగ్రామ్‌ను లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ప్రారంభించింది. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు విద్యార్థులకు ఈ శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఏఐ కోర్సుల్లో 270 గంటల థియరీ, 80 గంటల ప్రాజెక్టు వర్క్, బిగ్ డేటా కోర్సులలో 160 గంటల థియరీ, 80 గంటల ప్రాజెక్టు వర్క్ ఉంటుందని శామ్‌సంగ్ ప్రధాన అధికారి పార్థా ఘోష్ తెలిపారు. ఈ కోర్సులు ఉద్యోగ నియామకాల సమయంలో సహాయపడతాయన్నారు.

మత్స్యకారులకు సీపీ పలకరింపు



జోడుగుళ్లపాలెం వద్ద మత్స్యకారులతో మాట్లాడుతున్న సీపీ శ్రీకాంత్

ఆరిలోవ: జోడుగుళ్లపాలెం తీరంలో సాక్షి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నిర్వహించిన బీచ్ క్లీనింగ్‌లో భాగంగా నగర సీపీ శ్రీకాంత్ ఇక్కడ తీరం వద్ద ఉన్న మత్స్యకారులను పలకరించారు. తీరంలో రక్షణ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. ఇటీవల జీవీఎంసీ నియమించిన లైఫ్ గార్డుల పనితీరు, చేస్తున్న సేవలపై ఆరా తీశారు. ఏయే సమయాల్లో అలలు ఉధృతంగా ఉంటాయి.. అలాంటి సమయాల్లో ఏవిధంగా జాగ్రతలు పాటిస్తారు.. తదితర అంశాల గురించి ప్రశ్నించారు. సీపీ నేరుగా తమ వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకోవడంతో స్థానిక మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.

వైభవంగా ముత్యాలమ్మ పరస

- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- నక్కవానిపాలెంలో జాతర సందడి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



జాతరలో విద్యుద్దీపాలంకరణ, స్టాల్స్ వద్ద సందడి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో ముత్యాలమ్మ వారి పరస మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, కేశవరెడ్డి దంపతులు, గిడ్డంగుల మాజీ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి, కాయల సూరారెడ్డి దర్శించుకుని, పూజలు చేశారు. ఉత్సవాల్లో సాము గరిడీ, భజనతో పాటు విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. గ్రామ కమిటీ పరస రోజు అమ్మవారికి పసుపు, కుంకుమ, ఫలం, పుష్పాలు సమర్పించింది. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు డి.వి.ఎస్.ప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ దిలీప్‌కుమార్.రెడ్డి, కోశాధికారి రాజా, శ్యామ్‌కుమార్, కంద్రపు వేణు, దల్లి రామకృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, ఆలయ ధర్మకర్త ఎరుసు నర్సింగరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో గరిడీ సేవ

స్వీయ కథా పఠనం



కథా పఠనం చేస్తున్న రచయిత భాగవతుల సత్యనారాయణమూర్తి

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం స్వీయ కథా పఠనం సాహిత్య కార్యక్రమం జరిగింది. విభిన్న సామాజిక అంశాలపై రచయితలు తమ స్వీయ కథలను చదివి వినిపించారు. సభాధ్యక్షత వహించిన సిహెచ్.చిన సూర్యనారాయణ, ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు కథానిక అమృత హస్తంను విశ్లేషించారు. ప్రముఖ రచయిత మేడా మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ కథల్లో ప్రధానమైనవి అంశం, కథాశిల్పం, కథనం చక్కగా కుదిరితే పాఠకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంటాయన్నారు. అనంతరం ఉపశమనం కథను వినిపించారు. రచయిత భాగవతుల సత్యనారాయణమూర్తి 'విచిత్ర ప్రయాణం 'కథానిక, చిన సూర్యనారాయణ 'తెలివి తక్కువ'కథను, సి.ఎన్.వి.ఎస్.కృష్ణారావు, రామతాత కథలను విశ్లేషించారు.

నిరుపయోగంగా బోరు



పీ అండ్ టీ కాలనీలో పని చేయని బోరు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పరిధి పీ అండ్ టీ కాలనీలో బీజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయం సమీపంలోని 11/5 నంబరు గల బోరు పనిచేయడం లేదు. ఏడాదిగా ఇదే పరిస్థితి. గతంలో పరిసర ప్రాంతాల వారికి ఈ బోరు చాలా ఉపయోగపడేది. రానున్నది వేసవి కాలం కావడంతో, బోరు మరమ్మతులకు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కేఎన్ఎం హైస్కూల్‌లో బాలికా దినోత్సవం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని కేఎస్ఎం గర్ల్స్ హైస్కూల్‌లో బుధవారం ధరణి సంస్థ, చైల్డ్ రైట్స్ ఫర్ యూ(క్రై)లు సంయుక్తంగా జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికలకు చిత్రలేఖనం, వక్తృత్వం, తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏయూ సెంటర్ ఫర్ వుమెన్ స్టడీస్ డైరెక్టర్ పి.ఉష మాట్లాడుతూ బాలబాలికలను సమాన దృష్టితో పెంచాలని సూచించారు. విద్య ద్వారా బాలికలు ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని, తద్వారా బాల్య వివాహాలు అరికట్టడం, బాలికల అక్రమ రవాణా నివారణ సాధ్యమవుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రాము మాట్లాడుతూ డిజిటల్, సాంకేతిక విద్యలను బాలికలు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి, కమ్యూనిటీ ఆర్గనైజర్ రమాదేవి, సాయిలక్ష్మి, ఐశ్వర్య, పాఠశాల సిబ్బంది గ్లోరి, నిత్య, తదితరులు పాల్గొన్నారు.

29న భువనేశ్వరి అమ్మవారి అధివాసం



అల్లిపురం: ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 29న సబ్బవరం మండలంలోని మణిపురంలో గల భువనేశ్వరీదేవి ఆరాధన పీఠంలో అమ్మవారికి వాకుడు (బజీభతి)పత్రితో అధివాసం నిర్వహించనున్నట్టు సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకులు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు అమ్మవారికి మంగళస్నానం, దివ్య పంచామృతాలు, పాలు తదితరాలతో శుద్ధి చేసి శాస్త్రోక్తంగా ఆదివాసం జరుపుతామని పేర్కొన్నారు. భక్తులు పూజలు చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

28న రథసప్తమి వేడుకలు



వైశాఖి స్పోర్ట్సు పార్కులో రథసప్తమి వేడుకల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న సనపల వరప్రసాద్

మురళీనగర్: టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ విశాఖ జిల్లా శాఖ సౌజన్యంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో వైశాఖి స్పోర్ట్సు పార్కులో ఈ నెల 28న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం రథసప్తమి వేడుకల బ్యానర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రత్యేక పూజల అనంతరం ఆదిత్య హృదయ పారాయణం, 108 మంది విద్యార్థులతో సూర్యనమస్కారాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మప్రచార పరిషత్ ప్రతినిధి చల్లా సత్యనారాయణ, ఎంవీవీ సత్యనారాయణ, ఆలపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'భాగవతంలో 21 అవతారాల ప్రస్తావన'



ప్రవచనం చేస్తున్న భారతీమహాస్వామి

సీతంపేట: భాగవతంలో 21 అవతారాల ప్రస్తావన ఉందని కుర్తాళం శంకరాచార్య శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా లలితా పీఠంలో జరుగుతున్న భాగవత సప్తాహంలో రెండోరోజు బుధవారం సాయంత్రం ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైమిశారణ్యంలో మహర్షులు ప్రస్తావించిన పురాణాల ప్రశస్తిని, దశావతారాల ఆవిర్భావాన్ని, పరిణామ ప్రక్రియను వివరించారు. భాగవతంలోని 21 అవతారాల తత్వాన్ని, నర నారాయణ తత్వ స్వరూపాన్ని తెలియజేశారు. ఈ ప్రవచన కార్యక్రమంలో శక్తి పీఠాధిపతి మాతా రమ్యానంద భారతి స్వామి, కుర్తాళం సీఈవో మోచర్ల శశిభూషణ్, పలువురు ఆధ్యాత్మిక సాహితీవేత్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు సరస్వతి అలంకరణలో లలితా అమ్మవారు: వసంత పంచమిని పురస్కరించుకుని లలితాదేవి అమ్మవారు సరస్వతి అలంకరణలో గురువారం ఉదయం భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. సరస్వతి హోమం, విద్యార్థులకు సరస్వతి ప్రసాద వితరణ చేస్తామన్నారు.

బిల్లు లేని పాత మొబైల్ ఫోన్లు కొంటే శిక్షార్హులు



సమావేశంలో పాల్గొన్న సెకండ్ హ్యాండ్ మొబైల్ దుకాణాల యజమానులు

అల్లిపురం: బిల్లులు లేని సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొంటే శిక్షార్హులవుతారని నగర క్రైం డీసీపీ నాగన్న పాత మొబైల్ కొనుగోలు దుకాణదారులను హెచ్చరించారు. డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం సాయంత్రం సెకండ్ హ్యాండ్ మొబైల్ దుకాణదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు ఎవరి దగ్గరికైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు అమ్మకానికి తీసుకువచ్చిన వారిపై అనుమానం ఉన్నట్లయితే తక్షణమే సంబంధిత పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. అలా కాని ఎడల దుకాణదారులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. నగరంలో సుమారు వంద వరకు సెకండ్ హ్యాండ్ మొబైల్ షాపులు ఉన్నాయన్నారు. వారందరు పోలీసుల సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు. నిందితులను పట్టుకోవడంలో పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ యర్రంనాయుడు, సీసీఎస్ సీఐ సత్యనారాయణ, రమేష్, టూటౌన్ క్రైం ఎస్ఐ కె.శ్రీనివాస్, సెకండ్ హ్యాండ్ మొబైల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఓటు



కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మురళీనగర్: దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలకు మూల స్తంభంగా పౌరుల ఓటు హక్కు నిలుస్తుందని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు కృష్ణారావు అన్నారు. ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు.

వైద్య ఉద్యోగుల ప్రతిజ్ఞ

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, అధికారులతో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, జిల్లా మీడియా అధికారి పి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజారులో..

సీతమ్మధార: ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించాలని సీతమ్మధార రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు కోరారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని, కలెక్టర్ ఆదేశాల మేరకు రైతుబజారులో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు



సీతమ్మధార రైతుబజారులో ప్రతిజ్ఞ చేస్తున్న రైతులు

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఎంపికైన అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి, కె.సుధ

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. సినర్జీస్ కాస్టింగ్, వరుణ్ మోటార్స్, లక్ష్మీ కియా మోటార్స్, లక్ష్మీ హ్యుందాయ్ మోటార్స్, మ్యాంగో మోటార్స్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ కంపెనీల్లో 221 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ట్రైనీ, పెయింటర్స్, టెక్నీషియన్స్, సేల్స్, కన్సల్టెంట్, టెలీ కాలర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, తదితర ఉద్యోగాలకు సుమారు 289 మంది అభ్యర్థులు హాజరైనట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. వీరిలో 64 మంది అభ్యర్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని, వారికి నియామక పత్రాలు అందజేశామని చెప్పారు. అనంతరం అభ్యర్థులతో జాతీయ ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.

కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి

- లోక్ అదాలత్ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ

విశాఖ లీగల్ : శరవేగంతో విస్తరిస్తున్న విశాఖలో కార్మిక రంగం అంతే వేగంగా పెరుగుతోందని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో నగరంలోని వివిధ షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న కార్మికులు, ఇతర విభాగాల సిబ్బందితో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విశాఖలో షాపింగ్ మాల్స్, మాల్స్, బహుళ జాతి సంస్థల మాల్స్ పెరుగుతున్నాయని చెప్పారు. వీటిల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రత్యేక చట్టాలు అమలు చేస్తున్నట్లు వివరించారు.

కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఈ – శ్రమ్ అమలులో ఉందన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు ఈ – శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు లోక్ అదాలత్‌లో ప్రత్యేక విభాగం ఉందన్నారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ మోహన్ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి కార్మికుని కుటుంబానికి భద్రత అవసరమన్నారు. నగరంలోని వివిధ మాల్స్‌లో పనిచేస్తున్న కార్మికులు తమ వివరాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

అధ్వానంగా బాలుర వసతిగృహం

- పట్టించుకోని అధికారులు
- విద్యార్థుల అవస్థలు
- ప్రభుత్వ ఆశయానికి తూట్లు



పెచ్చులూడిన గోడలు



పాడైన బాత్‌రూమ్ తలుపులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ హాస్టల్‌లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న సుమారు 30 మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. హాస్టల్ గదుల వరకు బాగానే ఉన్నా, బాత్‌రూమ్‌లు, ఇతర సదుపాయాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. నిర్వహణ లోపంతో వారికి అవస్థలు తప్పడం లేదు. భోజనం కూడా ఒక్కోరోజు సరిగ్గా ఉండడం లేదని, విద్యార్థులు ఆ పూట సరిగ్గా తినడం లేదని చెబుతున్నారు.

అస్తవ్యస్తంగా 'మరుగు'

వసతి గృహంలో మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. తలుపులన్నీ తుప్పు పట్టి, కింది భాగమంతా పాడైపోయాయి. మరుగుదొడ్లను సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో దుర్గంధంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆరోగ్యం పాడవుతుందని ఆందోళన చెందుతున్నారు. స్నానాల గది గోడలు పెచ్చులూడిపోవడంతో ఇనప ఊచలు బయటికి వచ్చి, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను అభివృద్ధి చేస్తుంటే.. అధికారులు మాత్రం నిర్వహణను గాలికి వదిలేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో వార్డెన్ పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలున్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పరిశీలించి, విద్యార్థుల కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.